సాక్షి నంద్యాల

శుక్రవారం : 22 : ఆగస్టు : 2025



గణేశ్ విగ్రహాలకు క్యూఆర్ కోడ్

వినాయక చవితి పండుగ సందర్భంగా బహిరం గ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే గణేశ్ మండపాలకు పోలీస్ శాఖ క్యూఆర్ కోడ్ సేవలను వినియోగిం చనుంది. 10లో



పెద్ద రాజు స్వామికి గంధం సమర్పణ

గూటుపల్లె గ్రామంలో వెలసిన హజరత్ సయ్యద్ షా అబ్దుల్ రహమాన్ ఇద్రూస్ బాషా (పెద్దరాజు స్వామి)కి గురువారం గంధంతోపాటు ఫాతేహా లు సమర్పించారు. 10లో



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,624.42
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 74.615
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 1,29,439
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 1,30,038

న్యూస్‌రీల్

సార్.. మా పింఛన్లు పునరుద్ధరించండి



డిప్యూటీ ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న దివ్యాంగులు

కొలిమిగుండ్ల: ప్రభుత్వం తొలగించిన పింఛన్ లను వెంటనే పునరుద్ధరించాలని దివ్యాంగులు డిమాండ్ చేశారు. గురువారం వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకొని డిప్యూటీ ఎంపీడీఓ చంద్రమౌళీశ్వరగౌ డ్‌కు వినతి పత్రం అందజేశారు. ఎన్నో ఏళ్ల నుం చి పింఛన్ తీసుకుంటున్నామని, కూటమి ప్రభు త్వం ఉద్దేశపూర్వకంగా తమ పేర్లను తొలగించిం దని మండిపడ్డారు. పర్మినెంట్ సదరం సర్టిఫికెట్లు ఉన్నా రీవెరిఫికేషన్‌కు అంటూ వైకల్య శాతం తక్కువ చూపడం పేదలను మోసం చేయడమే నన్నారు. యథావిధిగా వచ్చే నెల 1వ తేదీ పిం ఛన్ సొమ్ము అందించాలని డిమాండ్ చేశారు.

పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి



స్కౌట్ అండ్ గైడ్ విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న డీఈఓ

శిరివెళ్ల: విద్యార్థులు పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకో వాలని డీఈఓ జనార్దనరెడ్డి అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, ల్యాబ్, లైబ్రరీ, వంట గదిని పరిశీలించారు. మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తున్నా కొందరు విద్యార్థులు ఎందుకు తినడం లేదని, వారి జాబితా తయారు చేసి తల్లిదండ్రులతో మాట్లాడాలని హెచ్‌ఎం గోవిందరాజును ఆదేశించారు. స్కౌట్ అండ్ గైడ్ విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. అనం తరం ఎస్సీ కాలనీలోని ఆదర్శ ప్రాథమిక పాఠశా లను తనిఖీ చేశారు. తరగతి గదులు శిథిలావ స్థకు చేరుకోవడంతో నూతన భవన నిర్మాణానికి ప్రతి పాదనలు పంపాలని హెచ్‌ఎం తేజోవ తమ్మను ఆదేశించారు. అయన వెంట డిప్యూటీ డీఈఓ శంకరప్రసాదు, సీఆర్పీ అన్సర్ ఉన్నారు.


దెబ్బతిన్న పంటలపై నివేదిక అందజేస్తాం



నీటమునిగిన పంట పొలాలను పరిశీలి స్తున్న వ్యవసాయ అధికారులు

ఆత్మకూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఆత్మకూరు ఏడీఏ హేమలత అన్నారు. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరి శోధన నిపుణులు అశోక్‌కుమార్, ప్రధాన శాస్త్ర వేత్త పుల్లీబాయ్, సీనియర్ శాస్త్రవేత్త నజీరుద్దీన్‌తో కలసి గురువారం ఆమె నీట మునిగిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. వర్షాలకు మొక్కజొన్న, పత్తి, మెట్ట వరి పం టలు దెబ్బతిన్నాయన్నారు. పంటలలో నిలిచిన నీటిని తొలగించిన అనంతరం హెక్టారుకు పది కిలోల యూరియా లేదా పొటాషియం నైట్రేట్ ఐదు కేజీల చొప్పున లేదా 19.19.19 స్ప్రే రూపంలో నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఇలా చేయడం వల్ల పంటను తేమ, తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చన్నారు.

చిరుగించని సాగు



- కనిపించని చిరుధాన్యాల సాగు
- ప్రోత్సహించని రాష్ట్ర ప్రభుత్వం
- రాయితీలకు మంగళం!
- ధరలు లేక నష్టపోతున్న రైతులు

కర్నూలు(అగ్రికల్చర్): రాగులు.. ఊద లు.. ఆరికలు.. కొర్ర.. అండుకొర్రల సాగు అసలు లేకుండా పోయింది. పండించిన చిరుధాన్యాలకు ధరలు పడిపోయాయి. 'సిరి'ధాన్యాల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు ఇవ్వడం లేదు. 2023–24లో రికార్డు స్థాయిలో ధరలు లభించడంతో 2024–25లో రైతులు ఈ పంటలను పెద్ద ఎత్తున సాగు చేశారు. కొర్ర సాధారణ సాగు 4,210 ఎకరాలు మాత్రమే ఉండగా గత ఏడాది రికార్డు స్థాయిలో 15,420 ఎకరాల్లో సాగు చేశారు. దిగుబ డులు మెరుగ్గా వచ్చినప్పటికీ ధరలు పతనం అయ్యాయి. 2023–24లో క్వింటా ధర రూ.6,000 ఆపైనే ఉం డగా 2024–25లో రూ.2,500 లభించడం కష్టమైంది. ధరలు పడిపోయినా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రాయితీ లకు మంగళం పలుకడంతో పాటు పండించిన చిరు ధాన్యాలకు ధరలు పడిపోవడంతో ఈ ఏడాది సాగు పూర్తిగా తగ్గిపోయింది. చిరుధాన్యాల్లో ప్రధానమైంది కొర్ర కాగా.. 2025–26లో 1,953 హెక్టార్లకే పరి మితం అయ్యింది. రాగులు, ఊదలు, ఆరికలు, అం డుకొర్రల సాగు అస్సలే లేకుండా పోయింది.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిరుధాన్యాల సాగును ప్రోత్సహించింది. రైతులు పండించిన చిరుధా న్యాలను విదేశాలకు ఎగుమతులు చేయించింది. దీం తో 2023–24లో కొర్రలు క్వింటా ధర రూ.6 వేల వరకు పలికింది. చిరుధాన్యాల సాగును ప్రోత్సహిం చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా మిల్లెట్ బోర్డు కూడా ఏర్పాటు చేసింది. దీంతో రైతులు చిరుధాన్యాల సాగుపై ఆసక్తి చూపారు. సూర్యనంది, ఎస్‌ఐఏ 3156, ఎస్‌ఐఏ 3085, గరుడ, రేనాడు, మహనంది రకాలను సాగు చేశారు. ఇవి స్వల్పకాలిక రకాలు కావడంతో అప్పట్లో జూన్, జూలై నెలల్లో కొర్ర సాగు చేసుకొని.. అక్టోబరు నెలలో శనగ విత్తుకునే వారు. రెండు పంటలు పండించుకునే అవకాశం రావడంతో రైతులు అదనపు ఆదాయం కూడా పొందారు.

సిరి ధాన్యాల విశిష్టత ఇదీ..

- రసాయన ఎరువులు, పురుగుమందుల అవసరం లేకుండా, తక్కువ నీరుతో పండగలిగిన అత్యుత్తమ పోషక విలువలు కలిగిన పంట కొర్ర.
- సహజ పీచు పదార్థం కలిగి ఉండటమే కొర్ర ప్రత్యేకత.
- మనిషికి అవసరమైన పీచుపదార్థం (ప్రతి ఒక్కరికీ రోజుకు 38 గ్రాముల పీచుపదార్థం కావాలి) కొర్ర నుంచే లభిస్తుంది. తక్కిన 10 గ్రాములు కూరగాయలు, ఆకు కూరల నుంచి పొందవచ్చు.
- చిరుధాన్యాలు రోగ నిరోధక శక్తి కలిగి ఉంటాయి.
- వరి, గోధుమల్లో పీచుపదార్థం/ ఫైబర్ 0.2 నుంచి 1.2 వరకు ఉంటాయి. ఇవి ధాన్యపు పై పొరలలోనే ఉండటం వల్ల పాలిష్ చేయడం ద్వారా పోతున్నాయి. సిరిధాన్యాలలో పీచుపదార్థం గింజమొత్తం పిండిపదార్థాలలో పొరలు, పొరలుగా అంతర్లీనంగా ఉంటుంది.

విత్తనాలే లేవు!

కొర్ర విత్తనాలు సాధారణంగా 33 శాతం లేదా 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తారు. ఈ ఏడాది సబ్సిడీ ఇవ్వలేదు. దీంతో ఒక్క కిలో కూడా పంపిణీ చేయలేదు. ఏపీసీడ్స్ అస్సలు కొర్ర విత్తనాలే సిద్ధం చేయలేదు. ప్రత్యేక స్కీమ్ కింద 100 శాతం సబ్సిడీపై అంటే ఉచితంగా కొర్ర విత్తనాలను వివిధ మండలాలకు కేటాయిం చినప్పటికీ తీసుకునేందుకు రైతులు ముందుకు రాలేదు.

మిల్లెట్ కేఫ్ వెలవెల

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు 2023వ సంవత్సరాన్ని కేంద్ర ప్రభుత్వం మిల్లెట్ ఇయర్‌గా ప్రకటించింది. అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా చిరు ధాన్యాల సాగును ప్రోత్సహించింది. చిరుధాన్యాల వినియోగాన్ని పెంచేం దుకు 2023లో కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రత్యేకంగా మిల్లెట్ కేఫ్‌ను అప్పటి కలె క్టర్ సృజన ప్రారంభించారు. అప్పట్లో మిల్లెట్ కేఫ్‌కు రోజుకు 200 మందికి పైగా వినియోగదారులు వచ్చేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చిరుధాన్యాల సాగును, వినియోగాన్ని పూర్తిగా పక్కన పెట్టింది. దీంతో మిల్లెట్ కేఫ్‌కు చిరుధాన్యాల రావడం లేదు. వినియోగదారులు లేక వెలవెలబోతోంది. మాల్స్‌ల్లో సన్న బియ్యం కిలో ధర రూ. 60 ఉంటే కొర్ర బియ్యం ధర రూ.120 ఆపైనే పలుకుతోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం చిరుధాన్యాలు పండించే రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి రేయింబవళ్లు కష్టం చేసి పంట పండించిన అన్నదాతకు నష్టమే మిగులుతోంది.



కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటైన మిల్లెట్ కేఫ్

ఒక్క కిలో కూడా ఎగుమతి చేయలేదు



మేం రాయలసీమ విత్తన సేవా సంఘాన్ని ఏర్పాటు చేసి చిరుధాన్యాల సాగును ప్రత్యేకం గా చేపట్టాం. మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ కూడా ఉంది. 2023–24 వరకు చిరుధా న్యాలను విదేశాలకు ఎగుమతులకు అవకాశం ఉండేది. మేం ప్రతి నెలా 2–4 క్వింటాళ్ల వరకు విదేశాలకు ఎగుమతి చేశాం. అయితే 2024–25 నుంచి విదేశాలకు ఒక్క కిలో కూడా ఎగుమతి చేయలేని పరిస్థితి ఏర్ప డింది. చిరుధాన్యాలకు సిరిధాన్యాలుగా ప్రత్యేకంగా గుర్తింపు ఉన్నప్ప టికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు లేవు. ఇప్పటికైన రాయితీలు ఇవ్వాలి.

– వేణుబాబు, మిల్లెట్ రైతు, కర్నూలు

కొర్ర సాగు తగ్గింది

ఈ ఏడాది కొర్రసాగుపై రైతులు ఆసక్తి చూపలేదు. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి కొర్ర సాగు తగ్గింది. సబ్సిడీపై పంపిణీ చేసేందుకు కొర్ర విత్తనాలను రైతులకు అం దుబాటులో పెట్టినప్పటికీ తీసుకునేందుకు ముందుకు రాలేదు.

– పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు

రాష్ట్రంలో అభివృద్ధి కంటే అవినీతి ఎక్కువ!

- రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన కొనసాగుతోంది
- మహిళల పట్ల టీడీపీ ఎమ్మెల్యేలు ప్రవర్తిస్తున్న తీరు బాధాకరం
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి

పాణ్యం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి కంటే అవినీతి, అక్రమాలు అధికమయ్యాయని వైఎస్సార్‌సీపీ నం ద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆరోపించారు. మహిళల పట్ల టీడీపీ ఎమ్మెల్యేలు ప్రవరిస్తున్న తీరు బాధాకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పాణ్యంలోని వైఎస్సార్‌సీపీ కార్యా లయం వద్ద గురువారం విలేకరుల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడు తూ... టీడీపీ నేతలు ఇచ్చే కమీషన్లు తీసుకోని అధికా రులపై 'రెడ్‌బుక్'ను అమలు చేస్తున్నారన్నారు. మం త్రి అచ్చెన్నాయుడి ఒత్తిళ్లు తట్టుకోలేక ఆగ్రోస్ జీఎం చంద్రరాజమోహన్ దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లిపోయా యన్నారు. అదే స్థానంలో అనుభవం లేని వ్యక్తితో పనులు చేయిస్తున్నారన్నారు. 'కూటమి' పాలనలో రాష్ట్రంలోని వ్యవస్థలను సర్వనాశనం చేశారన్నారు.

అక్రమ కేసులు..

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలకు చెందిన సోషియల్ మీడియాలో ఏమైనా పోస్టు పెట్టినా, ఫార్వర్డ్ చేసినా యాక్టివిస్ట్‌పై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని కాటసాని ఆరోపించారు. మహిళలు అని చూడకుండా వేధిస్తూ జైలుపాలు చేస్తున్నార న్నారు. ఎనిమిది నెలలుగా వ్యక్తిపై 10 వరకు కేసులు నమోదు చేశారన్నారు. అవినీతి, అక్రమాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు బరితెగించినా సీఎం చంద్రబాబు పట్టిం చుకోవడం లేదని ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లాలో కేజీబీవీ ప్రిన్సిపాల్‌ను ఎమ్మెల్యే కూన రవికుమార్ ఎలా వేధించారో దేశం అంతా చూసిందన్నారు. ఎమ్మెల్యే వేధింపులతో ప్రిన్సిపాల్ ఆత్మహత్యాయ త్నానికి పాల్పడ్డారని గుర్తు చేశారు. గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ అదే పార్టీకి చెందిన మహిళ లను వేధించిన విషయం తెలిసిందేనన్నారు. నెల్లూరు జిల్లాలో జైలు శిక్ష అనుభవిస్తున్న రౌడీ షీటర్ శ్రీకాంత్‌కు పెరోల్ ఇవ్వాలని టీడీపీ ఎమ్మె ల్యేలు సిఫార్సు లేఖలు ఇస్తే మంత్రి అనిత అనుమతి ఇవ్వడం సిగ్గుచేటన్నారు.

యరియా కోసం ధర్నా చేయాలా?

యరియా కోసం రైతులు రోడ్లపై ధర్నా చేస్తున్నారం టే పాలన ఎలా ఉందో తెలుస్తోందని కాటసాని అన్నారు. యరియాను ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంటే రైతులకు ఇంకే చేస్తారని ప్రశ్నిం చారు. రాష్ట్రంలో ఉద్యోగులకు సీఎం చంద్రబాబునా యుడు తీవ్ర మోసం చేస్తున్నారని మండిపడ్డారు. నచ్చని అధికారులకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా, జీతాలు లేకుండా, రెడ్‌బుక్ వర్తింపజేస్తున్నట్లు గుర్తు చేశారు. మొన్న శ్రీశైలం ఎమ్మెల్యే అధికారులపై దాడి చేయడమే ఇందుకు నిదర్శమన్నారు. రాష్ట్రంలో అరా చాక పాలనకు స్వస్తి పలకాలని, లేదంటే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి , ఎస్టీ ఎస్టీసెల్ నాయకులు శ్రీనివాసులునాయక్, మండల కన్వీనర్ కరుణాకర్ రెడ్డి, పార్టీ నాయకులు సుబ్బారెడ్డి, ఉసేన్‌సా, బాలస్వామిరెడ్డి, రామలక్ష్మయ్య, సర్పంచ్‌లు జనార్ద న్, శ్రీనివాసరెడ్డి, రామచంద్రుడు పాల్గొన్నారు.

నాలుగో విడత 508 సెల్‌ఫోన్ల రికవరీ



సెల్‌ఫోన్లు అందుకున్న బాధితులతో ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

నంద్యాల: జిల్లాలో నాలుగో విడత మొబైల్ రికవరీలో రూ.83.82 లక్షల విలువ చేసే 508 సెల్‌ఫోన్ల రికవరీ చేసి బాధితులకు అందించామని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అన్నారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో మొబైల్ రికవరీ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో మొదటి విడత 2023 ఏప్రిల్‌లో రూ.1.52 కోట్ల విలువ చేసే 847 సెల్ ఫోన్లు, రెండో విడత 2023 అక్టోబర్‌లో రూ. 86.57 లక్షల విలువ చేసే 510, మూడవ విడత 2024లో రూ.2.43 కోట్ల విలువ చేసే 1,066 సెల్ ఫోన్‌లు, నాలుగో విడతలో రూ.83.82 లక్షల విలువ చేసే 508 సెల్‌ఫోన్‌లు రికవరీ చేశామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు వరూ 5.68 కోట్లు విలువ చేసే 2,934 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామన్నారు. మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గోవా, తెలంగాణా తదితర రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం, తూర్పుగోదావరి, నెల్లూరు, గుంటూరు, కర్నూలు, కడప, అనంతపురం, నంద్యాల జిల్లాల నుంచి రికవరీ చేశామన్నారు.

సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నాగా ర్జున సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు తీస్తోంది. శ్రీశైలం జలాశయానికి ఎగువ పరీవాహక ప్రాం తాల నుంచి భారీగా వరదనీరు వచ్చి చేరుతుండ డంతో, ఆదే విధంగా దిగువ ప్రాజెక్టులకు నీటిని విడుదల చేస్తున్నారు. తెరచి ఉంచిన 10 రేడియల్ క్రస్ట్‌గేట్ల నుంచి 4,20,370 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. బుధవారం నుంచి గురువారం వరకు జూరాల, సుంకేసుల, హంద్రీల నుండి శ్రీశైలంకు 4,68,273 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్టులకు 4,99,611 క్యూసెక్కుల నీటిని విడు దల చేశారు. క్రస్ట్‌గేట్ల ద్వారా 3,97,962 క్యూసె క్కులు, విద్యుత్ ఉత్పాదన అనంతరం 68,831 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదిలారు.



క్రస్ట్‌గేట్ల ద్వారా నాగార్జునసాగర్‌కు విడుదలవుతున్న నీరు

సాగు భూముల్లో సోలార్ పనులు ఎలా చేస్తారు

నందికొట్కూరు: సాగు భూముల్లో సోలార్ పనులు అడ్డుకోవాలని రైతులు ఆందోళనకు దిగారు. గురు వారం మిడుతూరు మండల పరిధిలోని పైపాలెం గ్రామ పొలిమేరలో జరుగుతున్న సోలార్ పనులపై రైతుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ శ్రీనివాసులు పరిశీలించారు. తమ పంట పొలాలను కాపాడాలని తహసీల్దార్ కాళ్లపై పడి రైతన్నలు వేడుకున్నారు. పంట పొలాలకు వెళ్లేందుకు రహదారులు ఏర్పాటు చేయాలని వినతి పత్రాలు అందజేసినా ఎందుకు స్పందించడం లేదని తహసీల్దార్‌ను రైతులు నాగేశ్వ రరావు, జగన్‌మోహన్‌రెడ్డి, రామలింగేశ్వరరెడ్డి, స్వామన్న, శివమూర్తి, మాలిక్‌బాషా ప్రశ్నించారు. సోలార్ గ్రీన్ కో ప్రాజెక్టు అధికారులు నిబంధ నలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సహించేది లేద న్నారు. జిల్లా అధికారులు స్పందించి న్యాయం చేయకపోతే గ్రామాన్నే వదిలేస్తామన్నారు. సమ స్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని రైతు లకు తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎస్‌ఐ ఓబులేసు, మండల సర్వేయర్ కృష్ణుడు, తది తరులు ఉన్నారు.



సోలార్ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

యూరియా అక్రమ రవాణా చేస్తే చర్యలు

- రైతులకు ఇచ్చే రాయితీ యూరియా పరిశ్రమలకు వాడరాదు
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: జిల్లాకు మంజూరైన రాయి తీ యూరియా ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాజ కుమారి హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో యూరియా అక్రమ రవా ణాపై వ్యవసాయ శాఖ, పోలీస్, సివిల్ సప్లై, ఇండస్ట్రీస్, విజిలెన్స్, పశుసంవర్ధక శాఖ, పొల్యూషన్ బోర్డ్ అధికారులతో కలెక్టర్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పంటల సాగు విస్తీర్ణం మేరకు రాయితీ యూరియా జిల్లాకే మం జూరవుతుందన్నారు. జిల్లాలో రైతులకిచ్చే రాయితీ యూరియాను కొందరు దారి మళ్లించి ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని యూరియా అక్రమ రవాణాను అడ్డుకోవాలన్నారు. పట్టణంలో రాయితీ యూరి యాను వివిధ రకాల పరిశ్రమలైన పౌల్ట్రీ ఫీడ్, క్యాటిల్ ఫీడ్, ఆల్కహాల్, ఫ్లై వుడ్ ఇండస్ట్రీస్, ప్లేట్, వస్త్ర పరిశ్రమ, సోప్స్ తయారీ వంటి అవసరాలకు ఉపయోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. రైతులకు ఇచ్చే రాయితీ యూరియా పంట పొలాలకు మాత్రమే వాడాలని, ఇతర అవసరాలకు ఉపయో గించడం నేరమన్నారు. యూరియా అక్రమ రవా ణా నివారణకు సంబంధించి మండల స్థాయిలో ఒక టీం వేసి తనిఖీ చేసి రెండు రోజుల్లో నివేదిక అందజేయాలని వ్యవసాయ అధికారులకు సూచిం చారు. రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా సక్ర మంగా పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని, ఎక్కడ కూడా యూరియా కొరత తలెత్తకూడదని అధికారు లను ఆదేశించారు.

చిన్నారులకు కన్నీటి వీడ్కోలు

- చిగిళిలో మిన్నంటిన రోదనలు
- ముగిసిన విద్యార్థుల అంత్యక్రియలు

ఆలూరు రూరల్/ఆస్పరి: ఆడుతూ పాడుతూ అంద రినీ నవ్వించే విద్యార్థులు ఆకస్మికంగా మృతి చెందడం .. వారి మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిం చాల్సి రావడంతో చిగిళి గ్రామంలో ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యారు. కన్నీళ్లతోనే చిన్నారులకు తుది వీడ్కోలు పలికారు. చిన్నా పెద్దా అని తేడా లేకుం డా అంత్యక్రియల్లో అందరూ పాల్గొన్నారు. విద్యార్థుల మృతదేహాలకు ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి నివాళు లర్పించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు మౌనం పాటించారు.

విషాద ఛాయలు

చిగిళి గ్రామ చరిత్రలో ఎన్నుడూ లేని విధంగా బుధవారం సాయంత్రం విషాద ఘటన చోటుచేసు కుంది. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న వినయ్, గొల్ల భీమేష్, మహబూబ్ బాషా, సాయి కిరణ్, శశి కుమార్, కిన్నెర సాయి, దుర్గా ప్రసాద్ బుధవారం సాయంత్రం ఎర్రకొండ వద్ద ఉన్న గరుసు కుంటకు వెళ్లారు. దుర్గా ప్రసాద్ తప్ప మిగతా అందరూ ఈతకు కుంటలో దిగి నీటిలో మునిగి మృతిచెందారు. దుర్గా ప్రసాద్ విష యాన్ని గ్రామస్తులకు తెలపడంతో విద్యార్థుల మృ తదేహాలను వెలికి తీశారు. ఆరుగురు విద్యార్థులు ఈతకు వెళ్లి మృతిచెందడంతో గ్రామం అంతా ఒక్కసా న్నారు. ప్రతి విద్యార్థి దహన సంస్కారాలకు హాజర య్యారు. మహిళలు రోదనలతో గ్రామం దద్దరిల్లింది. విద్యార్థుల మృతితో గ్రామంలో జిల్లా పరిషత్ ప్రాథ మిక పాఠశాల, జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశా లలకు సెలవు ప్రకటించారు. బుధవారం రాత్రి కర్నూలు డీఈఓ శామ్యూల్ పాల్ గ్రామానికి వెళ్లి ఆరు గురు విద్యార్థుల మృతదేహాలకు నివాళులర్పించారు. యులతో కలిసి ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్, తిరుమల రావు, ప్రైమరీ పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, జెడ్పీహెచ్ స్కూల్ హెచ్‌ఎం రంగప్ప.. పాఠశాలలో ఐదు నిమిషాలు మౌనం పాటించి విద్యార్థులకు సంతా పాన్ని తెలియజేశారు. కుంటలో విద్యార్థులు మృతిచెం దడంపై అసహజ మరణం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆస్పరి సీఐ గంగాధర్ తెలిపారు.



చిన్నారుల మృతదేహాలను అంత్యక్రియలకు తీసుకెళ్తున్న గ్రామస్తులు

రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి



సాయికిరణ్ మృతదేహానికి నివాళులర్పి స్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

నీటి కుంటలో మునిగి చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వా లని ఎమ్మెల్యే విరూపాక్షి ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులు మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విరూపాక్షి బుధవారం రాత్రి చిగిళి గ్రామానికి వెళ్లి విద్యార్థుల మృతదేహాలకు నివా ళులర్పించా రు. విద్యార్థుల తల్లిదండ్రులను పరా మర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒకే గ్రామానికి చెందిన, ఒకే తరగతికి చెందిన ఆరుగురు విద్యార్థులు ఒకే చోటకు చేరి మృతిచెం దడం తనను కలచివేసిందన్నారు. ఇలాంటి సం ఘటనలు ము న్ముందు జరగరాదన్నారు. బాధిత కుంటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవా లన్నారు. ఒక్కో విద్యార్థి కుంటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు.

క్లుప్తంగా

ఐదేళ్ల బాలుడిపై వీధి కుక్కల దాడి


బాలుడి కాలుని కరిచిన దృశ్యం

చిప్పగిరి: వీధి కుక్కలు బాలుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఈ ఘటన మండలంలోని నంచర్ల గ్రామంలోగురువారం చోటు చేసుకుంది. కుంటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వంచేటి లత, వంచేటి మహేష్‌కు ఐదు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. గురువారం ఉదయం ఇంటి దగ్గర ఆడుకుంటుండగా ఒక్కసారిగా ఐదు వీధి కుక్కలు దాడికి పాల్పడ్డాయి. చుట్టు పక్కలవారు చూసి కుక్కలను పొలదోలడంతో బాలుడు ప్రాణాల నుండి బయట పడ్డాడు. తీవ్రంగా గాయపడిన గౌతమ్‌ను తల్లిదండ్రులు గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

మొబైల్ క్యాంటీన్‌లో చెలిరేగిన మంటలు

- దంపతులకు గాయాలు

వెల్దుర్తి: పట్టణ శివారులో జాతీయ రహదారి పక్కన నిర్వహిస్తున్న మొబైల్ క్యాంటీన్‌లో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి నిర్వాహకులైన దంపతులు గాయపడ్డారు. పట్టణానికి చెందిన ఏసు రాజు కుటుంబ సభ్యులతో కలిసి మొబైల్ క్యాంటీన్ నిర్వహిస్తున్నాడు. రోజులాగే గురువారం వాహనంలోనే గ్యాస్ స్టౌపై వంటలు చేస్తుండగా సిలిండర్ పైప్‌లైన్ వద్ద లీకై మంటలు చెలరేగాయి. అక్కడే ఉన్న నిర్వాహకులైన దంపతులు ఏసురాజు, సుకన్యలకు మంటలు వ్యాపించాయి. పక్కనే ఉన్న వినియోగదారులు అప్రమత్తమై మంటలను ఆర్పేశారు. గాయపడిన దంపతులను 108లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు ఆరా తీశారు.

రోడ్డు ప్రమాదంలో గంజిహాళ్లి సర్పంచ్ మృతి


తోలు లింగమ్మ (ఫైల్)

గోనెగండ్ల: రోడ్డు ప్రమాదంలో గంజిహాళ్లి గ్రామ సర్పంచ్ తోలు లింగమ్మ(70) మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులుగా ఈమె 2021లో గెలుపొందారు. సర్పంచ్‌గా గెలిచిన అనంతరం గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. పత్తికొండ మండలంలోని దేవనబండ గ్రామంలో గురువారం జరిగే తమ సమీప బంధువుల పెళ్లి వేడుకలకు గంజిహాళ్లి గ్రామం నుంచి ఉదయం ద్విచక్ర వాహనంపై వెళ్లారు. పెళ్లి వేడుకలను చూసుకొని తిరిగి ద్విచ్రక వాహనం మీద వస్తుండగా బైలుప్పల, బి. అగ్రహారం గ్రామాల మధ్యలో ప్రమాదవశాత్తు తోలు లింగమ్మ బైక్‌పై నుంచి కింద పడ్డారు. తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరులో ఓ ప్రైవేట్ ఆస్పత్రి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. సర్పంచ్‌కు ఒక కుమారుడు, ఆరుగురు కూతుళ్లు ఉన్నారు. సర్పంచ్ తోలు లింగమ్మ మృతి సంఘటన తెలుసుకున్న పలువురు నాయకులు ఆమె భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వీబీఆర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో


వెలుగోడు: బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 11 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నట్లు తెలుగుగంగ ఏఈ శివనాయక్ తెలిపారు. వీబీఆర్ నుంచి దిగువకు 11,300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. గురువారం సాయంత్రానికి వీబీఆర్‌లో 14.78 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ వెల్లడించారు.


కనుచూపు మేర కమనీయ దృశ్యం

- నల్లమల సొగసు చూడతరమా!

ఆకాశంలో తేలియాడుతూ భూమిపైకి వచ్చిన మేఘాలు.. నల్లమల అడవులపై నాట్యం చేశాయి. అటూఇటూ కదులుతూ కనువిందు చేశాయి. భారీగా పెరిగిన వృక్షాలపై గొడుగులుగా కనిపించాయి. 'పొలాల్లో నిలిచిన నీటిని తాగేందుకు వచ్చాయా' అన్నట్లు చలించాయి. చుక్క నీటిని వర్షించకుండా ప్రకృతి సౌందర్యాన్ని అందరికీ పంచాయి. ఈ సుందర దృశ్యాలు గురువారం ఆత్మకూరు పట్టణ సమీపంలోని నల్లమల అడవి, సమీప ప్రాంతంలో ప్రకృతి ప్రేమికులను మైమరపించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


మేఘాలు తాకగా.. కొండలు పరవశించగా..


నల్లమల ప్రయాణానికి పచ్చని హారం

గ్రామీణ యువకులకు ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువకులకు ఎలక్ట్రీషియన్ (హౌస్ వైరింగ్) కోర్సులో సెప్టెంబరు 12 నుంచి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ కే.పుష్పక్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు యువకులు అర్హులని తెలిపారు. వివరాలకు కర్నూలు శివారులోని బి.తాండ్రపాడు సమీపంలోని కెనరా బ్యాంకు- గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (డీఆర్‌డీఏ-టీటీడీసీ ప్రక్కన)లో సంప్రదించవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు 63044 91236ను సంప్రదించవచ్చని తెలిపారు.

నేడు మద్రాసు రెజిమెంట్ అధికారుల రాక

కర్నూలు(అర్బన్): మద్రాసు రెజిమెంట్‌కు సంబంధించిన మాజీ సైనికులు, వారి వితంతువుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ఈ నెల 22వ తేదిన (నేడు) మద్రాసు రెజిమెంట్‌కు చెందిన అధికారులు ఇక్కడకు వస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎస్ ఆర్ రత్నరూత్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఈ నేపథ్యంలోనే మద్రాస్ రెజిమెంట్‌కు సంబధించిన వారు తమ సమస్యల పరిష్కారం కోసం పెన్షన్ పేమెంట్ ఆర్డర్, డిశ్చార్జి బుక్, అప్డేట్ బ్యాంకు పెన్షన్ పాస్ బుక్‌తో పాటు అవసరమైన ధృవపత్రాలతో స్వయంగా హాజరు కావాలని ఆమె కోరారు.

అక్రమార్కులు తవ్విన మృత్యు కుంటలు!

- ఆరుగురు విద్యార్థుల ప్రాణాలు పోవడానికి ఇవే కారణం
- ఎర్ర గరును కోసం కొండను తవ్వేసిన వైనం
- పట్టించుకోని అధికారులు


చిగిళి జిల్లా పరిషత్ హైస్కూల్ వెనుక భాగంలో ప్రమాదకరంగా నీటి కుంట


ప్రమాదకరంగా నీటి కుంట, బండరాళ్లు

ఆస్పరి: అక్రమార్కులు తవ్విన గుంతలే చిన్నారుల ప్రాణాలు తీసుకుంటున్నాయి. చిగిళి గ్రామ సమీపంలో ఉన్న ఎర్ర కొండలో అడుగడుగునా గుంతలు తీస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇలా తవ్విన గుంతలోనే చిగిళి ప్రాథామిక పాఠశాలలో 5తరగతి చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఈత కోసం వెళ్లి మృత్యువాతపడ్డారు. ఆస్పరి మండలంలోని బిణిగేరి గ్రామానికి సంబంధించిన 127-బి- సర్వేనంబర్లులో 100 ఎకరాలు, చిగిళి గ్రామానికి సంబంధించిన 195 సర్వే నంబర్లో 119 ఎకరాలు కొండ పొరంబోకు భూమి ఉంది. ఈరెండు సర్వే నంబర్లులో ఉన్న కొండను ఎర్ర కొండ అంటారు. ఈ వేసవిలో ఎర్రకొండలో ప్రతి రోజు జేసీబీలు పెట్టుకుని ఐదు ట్రాక్టర్లుతో 20 ట్రిప్పుల ఎర్ర గరుసును ఆదోనితో పాటు మిగతా గ్రామాల్లో అవసరమున్న వాళ్లకు తీసుకెళ్లి అమ్ముకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. రెండు నెలలు పాటు గరుసు తీసుకెళ్తున్నా అధికారులు ఎవ్వరూ పట్టించుకోలేదని చిగిళి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇవీ ప్రమాదకరం

ఆస్పరి మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ దగ్గర నీటి కుంటలు ప్రమాదకరంగా ఉన్నాయి. అంతేగాక పెద్ద పెద్ద బండరాళ్లు ఉండటంతో విద్యార్థులు ఆడుకోవడానికి కూడా స్థలం లేని పరిస్థితి నెలకొంది. చిగిళి గ్రామానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న 195 సర్వే నంబర్లోని కొండ పొరంబోకులో జిల్లా పరిషత్ హైస్కూలుకు 3.29 ఎకరాలు కేటాయించారు. ఆస్థలంలోనే ఐదు గదులు పూర్తికావడంతో ఈనెల 15వ తేదీన 6వ తరగతి నుంచి 10వ తరగతి చదువుచున్న విద్యార్థులు నూతనంగా నిర్మించిన గదుల్లోకి వెళ్లారు. హైస్కూలు ముందు, వెనుక భాగంలో పెద్ద నీటి కుంటలు ఉన్నాయి. అంతేగాకుండా స్కూలు కొండ పక్కనే ఉండడంతో విద్యార్థులు కొండ ప్రాంతాలకు వెళ్లే ప్రమాదం ఉంది. దీంతో హైస్కూలుకు కాంపౌండ్ వాల్ నిర్మించడమే కాకుండా ప్రమాదకరంగా ఉన్న నీటి కుంటల పూడ్చి, బండ రాళ్లను తొలగించాలని చిగిళి గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

అంతా అక్రమమే!



ఎర్ర కొండలోని 30 ఎకరాల్లో గరుసు కోసం అక్రమంగా గుంతలు తీశారు. గరుసు కోసం పెట్టిన నీటి గుంటలో పడి ఆరుగురు విద్యార్థులు మృతిచెందారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.

– నెట్టేకల్లు, చిగిళి

చర్యలు తీసుకుంటాం



అనధికారికంగా గరుసు, ఇసుకను తీసుకెళ్లే వారిపై చర్యలు తీసుకుంటాం. మా అనుమతి లేకుండా ఎక్కడా కూడా కొండ పొరంబోకు, పొరంబోకు భూముల్లో ఎలాంటి తవ్వకాలు చేయకూడదు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

– రామేశ్వరరెడ్డి, తహసీల్దార్

కేసులు నమోదు చేస్తాం



కొండల్లో కాని, చెరువుల్లో కాని అనధికారికంగా గరుసు, ఇసుకను ట్రాక్టర్లలో తీసుకెళ్తే కేసులు నమోదు చేస్తాం. ఎవ్వరైనా ఇసుక, గరుసును తీసుకెళ్తుంటే సెల్ 9121101159కు సమాచారం ఇవ్వాలి.

– గంగాధర్, ఆస్పరి సీఐ

గణేశ్ విగ్రహాలకు క్యూఆర్ కోడ్

- వివరాల నమోదుకు ప్రత్యేక వెబ్‌సైట్

కర్నూలు : వినాయకచవితి పండుగ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే గణేశ్ మండపాలకు పోలీసు శాఖ క్యూఆర్ కోడ్ సేవలను వినియోగించనుంది. ఈనెల 27వ తేదీన వినాయకచవితి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. వినాయక విగ్రహాల అనుమతులకు నిర్వాహకులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన పని లేకుండా సులువుగా అనుమతులు పొందేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చారు. https://ganeshutsav.net వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపరిస్తే స్థానిక పోలీసులు వాటిని పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారు. దరఖాస్తుదారుల చిరునామా, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, కమిటీ సభ్యుల ఫోన్ నంబర్లు, నిమజ్జనం తేదీ, సమయం, విగ్రహాన్ని ఏ వాహనంలో తీసుకువెళ్తారనే వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. నిర్వాహకులు నమోదు చేసే వివరాలను క్షేత్రస్థాయిలో పోలీసులు పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా ఉన్న మండపాలకు అనుమతులిస్తారు. ఇందుకోసం పోలీసు శాఖ ఓ క్యూఆర్ కోడ్ పత్రాన్ని జారీ చేయనుంది. నిర్వాహకులు/దరఖాస్తుదారులు పోలీస్ వెబ్‌సైట్ నుంచి క్యూఆర్ కోడ్‌ను డౌన్‌లోడ్ చేసుకుని విగ్రహాల దగ్గర ఏర్పాటు చేసుకోవాలి. ఉత్సవాలు పూర్తయ్యేవరకు వారి వారి పరిధిలో తిరిగే గస్తీ పోలీసులు, అధికారులు విగ్రహానికి ఉన్న క్యూఆర్ కోడ్‌ను బీట్ పోలీసులు తనిఖీ చేసేందుకు సౌకర్యంగా ఉంటుందని పోలీసు శాఖ జిల్లా వ్యాప్తంగా క్యూఆర్ కోడ్ సేవలను వినియోగించనుంది. పెద్ద విగ్రహాలు, మండపాల దగ్గర విధిగా సీసీటీవీలు ఏర్పాటు చేయించే విధంగా ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి పోలీసులకు ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి.

శాస్త్రోక్తంగా అష్టోత్తర పారాయణం


అష్టోత్తర పారాయణంలో సేవా భక్తులు


పారాయణంలో పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ప్రవచనం

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో అష్టోత్తర పారాయణం శాస్త్రోక్తంగా జరిగింది. గురువారం ఊంజల మంటపం వేదికగా పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల నేతృత్వంలో పారాయణం చేపట్టారు. దాదాపు 300 మందితో రాయరు స్తోత్రం, అష్టోత్తర పారాయణం చేశారు. పారాయణం భక్తులకు పీనుల విందు పంచింది. ఈ సందర్భంగా స్వామిజీ పారాయణం విశిష్టతను భక్తులకు ప్రవచించారు. ఆధ్యాత్మిక చింతనకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతాగానో దోహదపడతాయన్నారు. అష్టోత్తర పారాయణంలో పాలుపంచుకున్న భక్తులకు పీఠాధిపతి ఫల పూలమంత్రాంక్షింతలతో ఆశీర్వచనం చేశారు.

దివ్యాంగుల పింఛన్లు తొలగించే కుట్ర

- రౌండ్ టేబుల్ సమావేశంలో దివ్యాంగ సంఘాల నాయకులు


రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన దివ్యాంగ సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లను తొలగించే కుట్ర చేస్తోందని ప్రజా, దివ్యాంగ సంఘాల నాయకులు ఆరోపించారు. కర్నూలులోని కార్మిక కర్షక భవన్‌లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షురాలు రాజా మునెమ్మ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డీ ఆనంద్‌బాబు, ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి గోపాల్, ఉపాధ్యక్షురాలు రాధ, దివ్యాంగుల సాధికర పోరం అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శివశంకర్, ఉపాధ్యక్షులు వెంకటేష్, డీఆర్‌డబ్ల్యూఫ్ నాయకులు మస్తాన్, వికలాంగుల ఆదరణ సేవా సమితి నాయకులు మరియదాసు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం విచారణ పేరుతో దివ్యాంగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. 90 శాతం వికలత్వం ఉన్న వారికి 40 శాతం రాసి తీసి వేసే కుట్ర చేయడం దారుణమన్నారు. వెంటనే పెన్షన్ల విచారణను నిలిపి వేయాలని కోరారు. తొలగించిన పెన్షన్లను పునరుద్ధరించాలని, కొత్త పెన్షన్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగ సంఘాల నాయకులు నబీరసూల్, మౌలాలి, ఎస్‌ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా, గురుశేఖర ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు నాగ సుంకన్న పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ

కర్నూలు(అగ్రికల్చర్): డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ కార్యక్రమాన్ని ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ ఎం.ఉమాపతి తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ భవన్‌లో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లో వోల్టేజీ సమస్యలు, విద్యుత్ సిబ్బంది పనితీరు, అందుబాటులో ఉంటున్నారా.. లేదా అనేదానిపై ఇతరత్రా విద్యుత్ సమస్యలపై డయల్ యువర్ ఎస్ఈకి కాల్ చేయవచ్చని సూచించారు. విద్యుత్ వినియోగదారులు 73826 14308 నెంబరుకు ఫోన్ చేయవచ్చని సూచించారు.

26న కొట్టాలచెర్వులో మెగా న్యాయవిజ్ఞాన సదస్సు

ఆత్మకూరురూరల్: కొట్టాల చెర్వు గ్రామంలో ఈ నెల 26న జిల్లా లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో మెగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి. లీలా వెంకట శేషాద్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్పీలతో పాటు 20 ప్రభుత్వ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొంటారని వారు తెలిపారు. కార్యక్రమంలో గిరిజనులకు చట్టాల పట్ల అవగాహన కల్పిస్తారని తెలిపారు.

పెద్ద రాజు స్వామికి గంధం సమర్పణ

- వైభవంగా గూటుపల్లె దర్గా ఉరుసు
- తరలివచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న ఫక్కీర్ల విన్యాసాలు


పెద్ద రాజు స్వామికి గంధం సమర్పిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: గూటుపల్లె గ్రామంలో వెలసిన హజరత్ సయ్యద్ షా అబ్దుల్ రహమాన్ ఇద్రూస్ బాషా (పెద్ద రాజు స్వామి) ఉరుసు వైభవంగా కొనసాగుతున్నాయి. దర్గా పీఠాధిపతి గురు సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రీ ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజామున పెద్దరాజు స్వామికి గంధంతోపాటు పతేహాలు సమర్పించారు. దర్గా ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు, కవాలీ పోటీలు భక్తులను ఆకట్టుకున్నాయి. గోవా, ముంబాయి, కర్ణాటక, బెల్గం, బీజాపూర్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ఫక్కీర్ల సాహస విన్యాసాలు, కోవెలకుంట్లకు చెందిన ఇనాం దారుల నాట్యం అబ్బురుపరిచాయి. దర్గా పీఠాధిపతి ఇంటి నుంచి గంధం మహోత్సవం బయలుదేరినప్పుడు భక్త జనసందోహం, మేళతాళాలు, వాయిద్యాల మధ్య ఘన స్వాగతం పలికారు. పెద్ద రాజు స్వామికి ప్రత్యేక పూజలతో పాటు ఫతేహాలు సమర్పించారు. గంధం సమర్పణ అనంతరం దర్గా పీఠాధిపతిని గ్రామ పురవీధుల్లో గుర్రంపై ఊరేగింపు నిర్వహించారు. బుధవారం రాత్రి నుంచే ఆయా ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున్న భక్తులు ఉరుసు ఉత్సవాలకు భక్తులు హాజరై దర్గాలో భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. దర్గా నిర్వాహకులతో పాటు పెంచికలపాడుకు చెందిన దాతలు భక్తులకు అన్నదానం చేశారు. సీఐ వెంకటేశ్వరరావు, పోలీసుల ఆధ్వర్యంలో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.



ఊరేగింపుగా గంధం తీసుకొస్తున్న పీఠాధిపతి, కడ్డీలు గుచ్చుకుని విన్యాసం చేస్తున్న ఫక్కీర్లు

ఎమ్మెల్యే బుడ్డాపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

కోవెలకుంట్ల: అటవీశాఖ సిబ్బందిపై దాడి చేసిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని జాతీయ గిరిజన భవిష్యత్ పరిరక్షణ సమితి అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసనాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన కోవెలకుంట్లలో విలేకరులతో మాట్లాడుతూ దోర్నాల మండలం నెక్కంటి రేంజ్ ఫారెస్ట్ సిబ్బందిపై ఎమ్మెల్యే బుడ్డా తన అనుచరులతో కలిసి రామానాయక్, గురువయ్య, మోహన్‌కుమార్, కరీముల్లాపై దాడిచేశారన్నారు. విధి నిర్వహణలో ఉన్న అటవీశాఖ సిబ్బందిపై దాడికి పాల్పడిన ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పేర్కొన్నారు.

ట్యాంకర్, ట్రాక్టర్ ఢీ


ప్రమాదానికి గురైన వాహనాలు

కొలిమిగుండ్ల: తాడిపత్రి రోడ్డులోని కస్తూర్బా పాఠశాల సమీపంలో గురువారం సిమెంట్ ట్యాంకర్ ట్రాక్టర్‌ను ఢీకొనడంతో డ్రైవర్ గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. ఇటిక్యాల కు చెందిన ట్రాక్టర్ బెలుం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా అదే సమయంలో ఎదురుగా వస్తున్న సిమెంట్ ట్యాంకర్ కస్తూర్బా పాఠశాల సమీపంలోని మలుపుల వద్ద బలంగా ఢీకొంది. ట్రాక్టర్‌ను ట్యాంకర్ కొద్ది దూరం వరకు ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజిన్ తునాతునకలైంది. డ్రైవర్ వెంకటేశ్వర్లు గాయపడటంతో 108లో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డుపై వాహనాలు ఉండటంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని జేసీబీ సాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తొలగించి వాహనాలు రాక పోకలు సాగించేలా చర్యలు తీసుకున్నారు.

రూ.400కే బీఎస్ఎన్ఎల్ ట్రిపుల్ ప్లే సర్వీసులు


మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ జీఎం రమేష్

కర్నూలు(హాస్పిటల్): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రూ.400కే ట్రిపుల్ ప్లే సర్వీసులు అందుబాటులోకి తెచ్చినట్లు బీఎస్ఎన్ఎల్ కర్నూలు ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి.రమేష్ చెప్పారు. గురువారం స్థానిక బీఎస్ఎన్ఎల్ భవన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారులకోసం బీఎస్ఎన్ఎల్ ఒకే ప్లాన్ ద్వారా హైస్పీడ్ 20 ఎంబీపీఎస్ స్పీడు, 444 చానల్స్, 9 ఓటీటీలు, అపరిమితమైన వాయిస్ కాలింగ్‌తో నెలకు రూ.400కే అందిస్తున్నామన్నారు. ఈ ప్లాన్ కర్నూలు బిజినెస్ ఏరియాలోని కర్నూలు, నంద్యాల జిల్లాలోని అన్ని నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ ప్లాన్‌ను నమోదు చేసుకోవడానికి 1800 4444కు వాట్సాప్ ద్వారా హాయ్.. అని మెసేజ్ పంపడం ద్వారా, లేదా సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్లను సంప్రదించడం ద్వారా, https:.//bookmyfiber.bsnl.co.in వెబ్‌సైట్‌ను సందర్శించి ఆన్‌లైన్‌లో కనెక్షన్ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. బీఎస్ఎన్ఎల్ నుంచి కేవలం రూ.1లకే ఫ్రీడమ్ ప్లాన్ పేరుతో సిమ్ అందజేయనున్నట్లు జీఎం రమేష్ చెప్పారు. బీఎస్ఎన్ఎల్‌తో కలిసి వ్యాపారం చేయడానికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. లోకల్ కేబుల్ ఆపరేటర్స్(ఎల్‌సీఓ)లకు, మల్టిపుల్ సర్వీసు ఆపరేటర్స్(ఎంఎస్‌ఓ)లకు 50 శాతం కమిషన్‌తో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ ద్వారా ఇంటర్‌నెట్, టీవీ సేవలు కస్టమర్లకు అందించేందుకు ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. వివరాలకు పార్ట్‌నర్ సపోర్ట్ గ్రూపు ఎస్‌డీఈ జానకిరామ్‌ను మొబైల్ నెం.9422464999 ద్వారా సంప్రదించాలన్నారు. సమావేశంలో బీఎస్ఎన్ఎల్ డీజీఎం కె.రాజేశ్వరరావు, ఐఎఫ్ఏ డి.శ్రీలత, ఏజీఎం, డివిజనల్ ఇంజనీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.